క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని బీట్ మార్కెట్ సబ్ స్టేషన్‌లో 11కేవీ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పంచముఖి హనుమాన్ ఆలయం, రామగిరి, గాంధీనగర్, బీట్ మార్కెట్ ఏరియా, సీతారామచంద్ర స్వామి ఆలయం, క్లాక్‌టవర్, సావర్కర్‌నగర్, ఎన్జీకాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ

చండూరు : మండలంలోని తాస్కానిగూడం గ్రామంలో మంగళవారం డీఎస్పీ శివరాంరెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ నిర్వహించారు. జనవరి 2024లో కేసు నమోదు కాగా విచారణ మంగళవారం చేశారు. అసైన్‌మెంటు భూమి విషయంలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా అప్పట్లో కేసు నమోదైంది.

విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్ : నాసా నిర్వహించిన స్పేస్ కాంటెస్ట్‌లో నకిరేకల్‌లో న్యూవిజన్ పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బి.అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. 8,9, తరగతుల విద్యార్థులు నాలుగు గ్రూపులుగా విడిపోయి నాలుగు నెలలపాటు నాలుగు ప్రాజెక్టులపై రీసెర్చ్ చేసి నాసాకు పంపించారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు నాసా ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారని తెలిపారు.

హనుమత్ గాయత్రీ మహాయజ్ఞం

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో పుట్టకోటయ్య గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం హనుమత్ గాయత్రీ మహాయజ్ఞం, లక్ష పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శివప్రసాద్ శర్మ, హరీష్‌శర్మ, ఆంజనేయస్వామి మాలధారులు వాస నాగేష్ పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

మర్రిగూడ : నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణకు సిబ్బంది చొరవ చూపాలని అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కమ్మగూడ, లెంకలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను, నర్సరీని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవరకొండ ఏపీడీ యామిని, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఇన్‌చార్జ్ ఏపీఓ వివేక్‌సాగర్, టీఏలు, ఎఫ్ఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


గిరి ప్రకాష్

నల్లగొండ టూటౌన్ : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపురంలో ఈనెల 10వ తేదీ నుంచి జరిగే స్వామివివేకానంద అండర్-20 పురుషుల జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నల్లగొండకు చెందిన గిరి ప్రకాష్ ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఫుట్‌బాల్ జట్టును హైదరాబాద్‌లో ఎంపిక చేశారని.. గిరిప్రకాష్ గోల్ కీపర్‌గా ఎంపికయ్యారని వెల్లడించారు.

విద్యార్థులకు అవగాహన

తిప్పర్తి : ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా సర్వారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను సందర్శించారు. సర్వారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరాచారి, ఎస్‌ఏ సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : కొండాపురం, నెర్మట గ్రామాల యూపీఎస్ విద్యారులు చండూరు జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు భిక్షం, మధుమోహన్, ముత్యాలు పాల్గొన్నారు.

మర్రిగూడ : దామెరభీమనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ విద్యార్థులకు పోలీస్ విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం

- నార్కట్‌పల్లి మండలం టార్గెట్ 2.90 లక్షలు
- జూన్‌లో వన మహోత్సవం నాటికి అందించేలా ప్రణాళిక
- నర్సరీల్లో షేడ్‌నెట్‌ల ఏర్పాటు
- మొక్కలు ఎండిపోకుండా పర్యవేక్షిస్తున్న అధికారులు, సిబ్బంది


నార్కట్‌పల్లి నర్సరీలో వేసిన షేడ్‌నెట్

నార్కట్‌పల్లి : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో ఒక నర్సరీ ఏర్పాటు చేసింది. నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీల ద్వారా నాటనున్నారు. అయితే ఈ వేసవిలో రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండడంతో నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు నీళ్లు పోయించడంతోపాటు షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నర్సరీల పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. మొక్కలు చనిపోకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు.

29 పంచాయతీల్లో..

నార్కట్‌పల్లి మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నారు. జూన్ మాసం నాటికి 2.90 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు భావిస్తున్నారు. నార్కట్‌పల్లి నర్సరీలో 35 వేల మొక్కలు, అమ్మనబోలు, బి.వెల్లంల, ఎల్లారెడ్డిగూడెంలలో ఒక్కో నర్సరీలో 20 వేలు, అక్కెనపల్లి, చెర్వుగట్టులో 15 వేల చొప్పున, ఏపీ లింగోటం, ఔరవాణి, చిన్నతుమ్మలగూడెం, గోపలాయపల్లి, మాధవఎడవల్లి, మాండ్ర, నక్కలపల్లి, నెమ్మాని, శాపల్లి, తొండల్‌వాయి నర్సరీల్లో 10 వేల చొప్పున, ఎనుగులదోరి, తిరుమలగిరి, శౌరుబావిగూడెం, పోతనేనిపల్లి, పల్లెపహడ్, కొండపాకగూడెం, జువ్విగూడెం, దాసరిగూడెం, చౌడంపల్లి, చిప్పలపల్లి, చిన్ననారాయణపురం, బెండల్‌పహడ్, బాకిగూడెం నర్సరీల్లో 5 వేల చొప్పున మొక్కలను పెంచి జూన్‌లో నిర్వహించే వనహోత్సవం కార్యక్రమంలో నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈసారి జామ, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, గులాబీ, మందార, మునగ, కానుగ, గన్నేరు, చింత, ఈత తదితర మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధిహామీ కూలీలతో నీటిని పోయిస్తూ సంరక్షిస్తున్నారు.

షేడ్‌నెట్ ఏర్పాటు చేశాం



నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. మొక్కలు వాడిపోకుండా షెడ్‌నెట్‌తో పందిళ్లు ఏర్పాటు చేశాం. కూలీలతో కలుపు మొక్కలు తీయిస్తున్నాం. నీటి తడులు అందిస్తున్నాం.

–యాదయ్య, ఏపీఓ, నార్కట్‌పల్లి

ప్రణాళిక సిద్ధం చేశాం



వనహోత్సవం కార్యక్రమాన్ని నార్కట్‌పల్లి మండలంలో సమర్థంగా నిర్వహిస్తాం. అన్ని నర్సరీల్లో మొక్కలకు నీరందించేలా చర్యలు తీసుకున్నాం. మొత్తం మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

–ఉమేష్, ఎంపీడీఓ, నార్కట్‌పల్లి

కెనాల్ పనులు త్వరగా ప్రారంభించండి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి నియోజకవర్గంలోని కిష్టాపురం గ్రామ పెద్ద చెరువు వరకు లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు త్వరగా ప్రారంభించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రాజెక్టు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి 11.5 కిలో మీటర్లు ఉన్న కాల్వ పనులు ప్రారంభించి కిష్టాపురం చెరువులో నీరు నింపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కిష్టాపురం చెరువులోకి తవ్వే మెయిన్ కాలవతోపాటు అక్కడక్కడ డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి మునుగోడు మండలంలోని చెరువులు నింపేలా కాల్వలు తవ్వించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విఠలేశ్వర్, ఏఈ నవీన్ కుమార్‌లు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

నకిరేకల్ : ఓ వ్యకి నుంచి అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసినందుకే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, దీనికి కారణమైన వారిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మద్రు సంతోష్ ఈ నెల 3న నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసం ఉంటున్న మద్రు శంకర్‌రావు (65) గత నెల 26వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా శంకర్‌రావు కుమారుడు సంతోష్‌కుమార్ అమెరికాలో ఉండగా.. తండ్రి మరణ వార్త తెలుసుకుని ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు తండ్రి సెల్ ఫోన్‌లో వాట్సాప్ మెసేజ్ చూశాడు. ఆరా తీయగా.. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉండే మద్రు దామోదర్ అనే వ్యక్తి వద్ద తన తండ్రి రుణం తీసుకుని క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తున్నాడు. ఇటీవల అనారోగ్య సమస్యలతో వడ్డీ చెల్లించలేకపోయాడు. తీసుకున్న మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు సంతోష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని స్థానిక ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

రైతుల విజ్ఞప్తి మేరకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కనగల్: మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో ఐకేపీ కేంద్రాన్ని రైతుల విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. 'ఆట స్థలాలే ఐకేపీ కేంద్రాలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆ స్థలం గ్రామానికి దగ్గరగా ఉండడంతో, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు అక్కడ ఐకేపీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరినట్లు వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- ఎమ్మెల్యే మందుల సామేల్


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం మండలంలోని గురుజాల, తుడిమిడి, చిత్తలూరు, పెర్కకొండారం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. తుడిమిడి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతలవారీగా అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండలంలో పైలట్ ప్రాజెక్టుగా తుడిమిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య, మాజీ సర్పంచ్ మాదగోని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు

కట్టంగూర్ : నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని సూచించారు. గ్రామాల్లో మురుగు కాలువలు, మంచినీటి సమస్య, మంచినీటి ట్యాంకుల క్లీనింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, సిబ్బంది ఉన్నారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా


నల్లగొండ టౌన్: నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ మంగళవారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలది కార్తీక్, గుండాల నరేష్, భీమగోని గణేశ్, రామకృష్ణ, రఘువరన్, భోగరి సుకుమార్, బండ మహేష్, సతీష్, రాము, గోపి పాల్గొన్నారు.

నకిరేకల్ : కేంద్రం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ నకిరేకల్‌లో సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆటోలకు తాళ్లు కట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడోజు వెంకటేశ్వర్లు, బీవీచారి, నాయకులు బీరెడ్డి సత్తిరెడ్డి, గజ్జి రవి, ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొంగరాలు నర్సింహ, పిట్టల అనిల్, ఏనుగు సత్తిరెడ్డి, బూరుగు సత్తయ్య, రామన్న వెంకటేష్, చెరుకు సైదులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్రం వంట గ్యాస్ ధర పెంచడంపై నిరసన వక్తం చేస్తూ చిట్యాలలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యులపై అధిక భారం మోపుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అక్బర్, పట్టణ కార్యదర్శి షరీఫ్, నాయకులు బొల్గూరి లింగయ్య, శ్రీనివాస్, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, దేవేందర్, శేఖర్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. హాజరు రిజిస్టర్ పరిశీలించి వందశాతం హాజరు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తిప్పర్తి పీహెచ్‌సీలో అందజేస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ భవనం పురాతనమైనదని, ప్యూరిఫైడ్ వాటర్ యంత్రం పనిచేయడం లేదని, డెలివరీ చేసేందుకు టేబుల్స్, ఆటో క్లేవ్స్ తదితర పరికాలు అవసరం ఉన్నాయని కలెక్టర్‌కు వైద్యురాలు మమత విన్నవించారు. వాటిని వెంటనే మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెలివరీలతోపాటు పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు, భోజనం బాగుందా, అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని, నాణ్యమైన భోజనం ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. తదుపరి తిప్పర్తి మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, తహసీల్దార్ పరుశురాములు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం


నకిరేకల్ : నోములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


శాలిగౌరారం : ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నకిరేకల్ : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి, నోముల, వల్లాభాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నకిరేకల్ మండలం మంగళపల్లిలో రేషన్ షాప్ వద్ద లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్, పీఏసీఎస్ డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, మాజీ సర్పంచులు కుంచం రమణమ్మ సోమయ్య, బాదిని వెంకటరమణ, మాజీ ఎంపీటీసీలు షేక్ షాహిన్ నయీం, సామ మల్లమ్మ, యాస లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని కొండపాకగూడెం, చౌడంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం కొండపాకగూడెం, చిన్ననారాయణపురం, చౌడంపల్లి గ్రామాల్లో రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారి గౌతం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మల్లేషం, సట్టు సత్తయ్య, జేరిపోతుల భారత్, ఉదయ్‌కుమార్, చలపతిరెడ్డి, శివరాజ్, మహలింగం, సుధాకర్‌రెడ్డి, నగేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో..

తిప్పర్తి : మండలంలోని సర్వారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డితో కలిసి మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నాగులవంచ లింగారావు, మాజీ సర్పంచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద సన్నబియ్యంతో భోజనం చేయాలి

నార్కట్‌పల్లి : ప్రతి నిరుపేద సన్నబియ్యంతో భోజనం చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం చెర్వుగట్టు గ్రామంలోని రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీరేశం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ గౌతమ్, ఆర్ఐ తరుణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, నేతగాని కృష్ణ, వరాల రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి, పున్నపురాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్ రెడ్డి, సాగర్ల సైదులు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

శాలిగౌరారం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం మండలంలోని గురుజాల, తుడిమిడి, చిత్తలూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఏఓ సౌమ్యశృతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, ఏపీఎం రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఎర్ర చైతన్యపాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మర్రిగూడ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శన వేణుకుమార్ అన్నారు. మగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే గావ్ చలో అభియాన్-బస్తీ చలో అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, యాస అమరేందర్‌రెడ్డి, గ్యార గోపాల్, వేనేపల్లి శ్రీనివాస్‌రావు, గ్యార యాదగిరి, కేసరి రవీందర్‌రెడ్డి, పగిళ్ల లింగస్వామి, ముత్యంరెడ్డి, సిలివేరు వెంకటేష్, గ్యార రామలింగం, కిశోర్, యాదయ్య, కుమారస్వామి, శోభన్‌బాబు, నరసింహాచారి, శేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చండూరు : మండలంలోని కొండాపురంలో మంగళవారం ఆరు గ్యారంటీల దరఖాస్తులను బీజేపీ నాయకులు స్వీకరించారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట నాయకుడు నరేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నకిరెకంటి లింగస్వామిగౌడ్, శివ, యాదయ్య, వెంకన్న, చంద్రయ్య, సందీప్, అంజయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తిప్పర్తి : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట నాయకుడు నూకల వెంకటనారాయణరెడ్డి పార్టీ కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి, బ్రహ్మాచారి, వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు శ్రీనివాస్, మైనం మల్లయ్య, రాజు, మహేష్, జానయ్య, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పద్మానగర్ జంక్షన్ వద్ద రంబుల్స్


పద్మానగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రంబుల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి అంజయ్య

నకిరేకల్ : 65వ నంబర్ జాతీయ రహదారిపై నకిరేకల్ పద్మనగర్ జంక్షన్ వద్ద పోలీసులు వేగ నిరోధక చర్యలు చేపట్టారు. పద్మానగర్ జంక్షన్ వద్ద వాహనాలు అతి వేగంగా రావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇద్దరు వ్యక్తులు ఈ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఇటీవల ఈ జంక్షన్‌ను సందర్శించి తక్షణమే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా రోడ్డు భద్రత ప్రత్యేక అధికారి పోలిశెట్టి అంజయ్య ఆధ్వర్యంలో చౌదరి కంపెనీ సహకారంతో మంగళవారం ఈ జంక్షన్ వద్ద రంబుల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, ప్రాంతాల్లో రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ హైవే మెయింటెనెన్స్ ఇన్‌చార్జి కిషన్‌రావు, చౌదరి కంపెనీ ఇంజనీర్లు మధుకృష్ణ, రోడ్డు భద్రత సిబ్బంది రాజు, రాధాకృష్ణ, సోమేష్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచాలి

చిట్యాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు ఆసరా పింఛన్‌లను రూ.నాలుగు వేల నుంచి రూ.ఆరు వేలకు పెంచాలని తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వికలాంగుల చైతన్య పోరాట యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల నుంచి సేకరించిన వినతి పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గరిషే శేఖర్, నారాయణ, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాలు, చెత్త పేరుతో నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారని రైతులు మంగళవారం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. - తిప్పర్తి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కట్టంగూర్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

కట్టంగూర్ : పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆర్యోగంగా ఉండవచ్చని ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పోషణ్ అభియాన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగులందరితో కలిసి పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, ఎంపీఓ చలపతి, ఆర్ఐ కుమార్‌రెడ్డి, రాంమోహన్, సైదులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శారదారాణి, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

మాతా శిశు ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

కేతేపల్లి: మాతా, శిశు ఆరోగ్య రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 22 వరకు నిర్వహించనున్న పోషణ్ పక్వాడా కార్యక్రమంపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రక్తహీనత గల కిశోర బాలికలు, బాలింతలను వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది గుర్తించి వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీటీ సత్తార్, మండల వైద్యాధికారి అర్చన, ఎంపీఓ నాగలక్ష్మి, సూపరింటెండెంట్ భవాని, ఈజీఎస్ ఏపీఓ సురేందర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ జి.చినమునయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషణ పక్షం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యశోద, శ్రీలత, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, డాక్టర్ శాలిని, డీటీ చంద్రశేఖర్, ఏపీఎం వెంకట్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్

మర్రిగూడ : సన్నబియ్యం పంపిణీతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా దందాకు చెక్ పెట్టగలిగామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం సరఫరా చేయడంతో లబ్ధిదారుల్లో సంబురాలు నెలకొన్నాయని అన్నారు.